భిక్షుకస్త్రీ

శ్రీమతి అండలూరి సుబ్బలక్ష్మిగారు

"ఆడవాళ్లకు కూడా ఒక పత్రిక పెట్టారు, చిన్నా పెద్దా యీవన్మందీ కూడా దాంట్లో వ్రాస్తున్నారు. ఏడోక్లాసు చదువుతూ స్కూలులో చాలా ప్రయిజులు పుచ్చుకొంటూ, అనర్గళంగా భాగవతము, రామాయణము చదవగల నీవు ఏదైనా ఒక కథ వ్రాశేందుకు ప్రయత్నించకూడదా చెల్లీ" అన్నాడు మా అన్నయ్య. యుక్తవయస్సు వచ్చేవరకే స్కూలుకి పంపి, చదువు చెప్పించడమే, మహోపకారంలా తలచే తల్లి తండ్రులచాటున పెరిగే హిందూబాలిక, ఏం కథలు వ్రాయగలుగుతుంది? చిన్నపిల్లని లోకానుభవం లేనిదాన్ని, నేనేమి కథ వ్రాయగలనని హృదయంతరిచి చూచుకున్నాను. నా జీవితంలో అనుభవానికి వచ్చిన ఘట్టం స్ఫురించింది. అదే చెబుతాను వినండి.

మాయింట్లో ఉన్నవాళ్లం, నేను, మా అన్నయ్య, మా అమ్మ, మా వదిన అంతే. మాకుకొంచెం భూవసతి ఉంది. ఒక స్వంత యిల్లు, కొద్దిగా రొక్కం, దానా దీనా కాస్త సుఖంగానే కాలక్షేపం చేస్తున్నాము. మా అన్న బి. ఎ. ప్యాసై కూడా ఉద్యోగం చెయ్యడు. యింతకూ చేస్తానంటేమాత్రం యీరోజులలో దొరికే దెక్కడ. అతనికి ఆంగ్లభాషఅంటే అభిమానం మెండు. ఆంగ్లంలో కవిని కూడా అవుదామని అతని ఆశయం. నిత్యం గదిలో తలుపులుమూసుకొని కూర్చొని, ఆంగ్లకవులువ్రాసిన గీతాలు బిగ్గరగా దొరల ఫక్కీని చదువుతూ ఉంటాడు. బజారునుంచి ఏదైనా వస్తువు తెచ్చిపెట్టాలన్నా, యింట్లో కాస్త అస్వస్థతగా ఉంది డాక్టరునేనా పిలువమన్నా, మనం ఎంత కేకలువేసి పిలిచినా, గిడామన్నా పలుకడు; బుజ్జ బద్దల కొట్టుకొని చచ్చినా తలుపు తీయడు. ఇహ మా వదిన, యీవిడ ఉత్తరోగాలకుప్ప—సంవత్సరం పొడుగునా మూలుగుతూనేఉంటుంది. అంచేత మా అమ్మకు ఆడతోడు చిన్నమొగతోడు కూడా నేనే.

పగలల్లా నేను బడిలోగడిపి సాయంకాలం యింటికిరావడం. చీకటిపడగానే మేమంతాభోజనాలుచేసి, అన్నయ్య మినహా, గదిలోకిపోయి పక్కల్లోపడుకుంటాం. మా దొరగారు, రాత్రి పదిగంటలు వరకు ఏచేవో ఆంగ్లపద్యాలు చదివి అలసిపోయి ఇంట్లోకివచ్చి వదిన్ని లేపి, పీటేసుకొ కూచోమని, కాస్త నువ్వుకులాసాగా బాతాఖాని చేస్తూఉంటే, నేనువడ్డించుకొని తినేస్తానని, అన్నం తనే పెట్టుకొని తినేసేవాడు; మొదటే చెప్పాగా ఆతనివన్నీ దొరల పద్ధతు

లని. రాత్రియిల్లాగడిచేది, నాకు తెలివి ఉన్నంతమట్టుకు.

ఆ వేళరాత్రి మేము భోజనాలుచేసి గది లోనికిపోయి పండుకునేవేళఅయింది. అవి చలిరోజులు, పండుగు ముందుకూడాను. వీధిలో ఒక కేకవినబడ్డాది, అన్నంకోసం పరితపించే ఒక జీవిది, సంగీతంలా. ఆ కేక లోనిఅసహాయత, దీనత్వం, వేదన నా లేతగుండెల్లో జాలిని కదిపాయి. ఆమెను పిల్చి ఆనాడు మాయింట్లో మిగిలిన అన్నం పెట్టాను. పాపం ఆ విడ ఎంతో సంతోష ముతో 'అమ్మా! తల్లీ! నీకు చాలామంది పిల్లలు పుడతారు' అంటూ ఒకవిధమైన యాసతో, దీవించి వెళ్లిపోయింది.

మర్నాడు రాత్రికూడా ఆవిడ వస్తుందని నాకు తెలుసు. అంచేతనే ఎసట్లో బియ్యం పోసేటప్పుడే, ఎక్కువ పోశాను. అనుకొ న్నట్లు రాత్రితొమ్మిదిగంటలవేళఅయ్యా సరికల్లా 'పుణ్యతల్లి! అన్నంపెట్టవమ్మా!' అంటూ హాజరైంది ఆవిడ. అల్లా జాలిగా కేకవేస్తే నాప్రాణం కొట్లాడేది. ఆ కేకలోని జాలి, వీధిలో ఉన్నవారిఅందరిహృదయా లకు అందదుకామోసు, లేకపోతే మరెవ్వరూ పిల్చి అన్నం ఎందుకు బెట్టరు?

ఇల్లా ప్రతిరోజూరాత్రి ఆవిడ వస్తూ ఉంటే అన్నం పెట్టడము నా కొక అలవాటై పోయింది. ఆవిడయెడల నాకొక సోదరీభావం కూడా ఏర్పడ్డాది. మాఅమ్మమాత్రం 'రోజూ మధూకరం పెట్టే వాళ్లని ఎక్కడా చూడమే, ఎప్పుడో అన్నం మిగిలిపోతే యింత పడేస్తారు గాని' అనేది. నేనుమాత్రం ఎవరి కడుపులోనూ అన్నం ఉట్టికట్టుకు ఉండి పోదు; యింతకు నాలికదాటితే నరకమేను, బీదల కింత పడేస్తే యిహంపరం కూడాను అంటూ ప్రతిరోజున ఆవిడకు తప్పకుండా అన్నం పెట్టేదాన్ని.

ఈ రీతిగా కొద్దిరోజులు గడిచాయి. ఆరాత్రి చలి చాలా జాస్తీగాఉంది. భోజనా లైయాక, ఆ భిక్షుకస్త్రీకోసం, సిబ్బిలో అన్నంపెట్టుకొని, వీధి తలుపుతెరచి సావిట్లో కూచున్నాను. నిత్యంవచ్చేవేళ తప్పిపో యింది, ఆవిడ రాలేదు. పదిగంటలు కూడా కొట్టారు. ఇంకా రాదేమి? చలిలో ఎంత సేపని కూచుంటా? నిద్రకూడా వస్తున్నాది. ప్రాణం విసిగి తలుపు వేసుకొని గదిలోకి పోయి పండుకున్నాను. ఉదయాన్నే మా అమ్మచేత చీవాట్లు 'ఆ ముండ రానులేదు చెయ్యాలేదు సిబ్బెడు అన్నం దిబ్బచేరింది' అని. పాపం! ఆవిడ ఎంచేతరాలేకపోయిందో? వంట్లో బాగులేదేమో? అని అనేక విధాల నామనస్సు కళవళ పడ్డాది.

ఇంతట్లో పండుగ దినాలు దగ్గరకు వచ్చాయి. ఊళ్లో ఎక్కడచూచినా యిళ్లకు సున్నాలు వేసుకొనేవారు, తలుపులకు తారురాసుకొనేవారు, గుమ్మాలకు పసుపు రాసి బొట్టుపెట్టుకొనే వారును, కొత్తబట్టలు కుట్టించుకొనేవారు. ఒకవిధమైన నూతనో త్సాహముతో పండుగదినాలు వచ్చాయి.

ఎక్కడచూచినా పేకాట హడావిడి రేగింది. మాయింట్లో కూడా మా అన్నయ్య, మేడమీద అద్దెకుఉన్న బడికుఱ్ఱవాళ్లు పగలల్లా ఆడడమే కాకుండా రాత్రిభోజనానంతరము మావీధి అరుగుమీద తీణివేసి పదకొండు గంటలరాత్రిఅయ్యేవరకు అదే పేకాట. పండుగదినాల్లో పేకాడడము దేశంపాడుగున ఒకరివాజుఅయిపోయింది. పండుగదినాలంటే ఒక దానధర్మం చేసుకొనేందుకు పర్వదినాలుకాని, బేస్తు మీద బేస్తు పెట్టి, నిద్రాహారాలు మాని, యిల్లు వళ్లు గుల్ల చేసుకొనేందుకుగాదు. ఆమొగాళ్ల కర్మం మొగాళ్లదికాని ఆడవాళ్లకీ అదేపాడుబుద్ధి. నాస్నేహితురాళ్లు, ఎందరో ఆడపిల్లలు ఆ పండుగ రోజున మాయింటికివచ్చి పేక ఒకటి తెచ్చి, బిస్కత్తులుకాచి, పిప్పరమెంట్లుకాచి, పేకాడుకుందాము రమ్మనమని పీక్కుతిన్నారు. నేను మాత్రం తలంటి నీళ్లుపోసుకొని, మా అమ్మయిచ్చిన కొత్తబట్టలు కట్టుకొని, ఏదేనా కొనుక్కోమని మాఅమ్మ యిచ్చిన రెండు అణాలు జేబులోపెట్టుకొని, బుట్టలో బియ్యంపోసుకొని, గుమ్మం దగ్గర కూర్చొని, వచ్చిన ముష్టివానికల్లా పిడికెడేసి బియ్యం పెడుతూ ఉదయంఅంతా గడిపాను. మధ్యాహ్నము, పిండివంటలతో భోజనము చేసి, వీధిసావిట్లో ఖర్జూరపుచాపవేసుకొని కూర్చుని, పోతన్నగారిభాగవతంతీసుకొని గజేంద్రమోక్షంచదువుతూ గడిపాను. లా 'వొక్కింతయులేదు' అన్న పద్యంచదివినప్పుడు ఆ భిక్షుకస్త్రీ నాహృదయంలో తోచింది. ఏమయినదో! కేకై నావినపడలేదు వీధిలో, ఈ పండుగ మూడురోజుల నుంచీ కూడాను. ఈరోజుల్లో ఆవిడగానివచ్చిఉంటే అన్నంతోపాటు పిండివంటలుకూడా పెట్టి ఉందునే?

పండుగ మూడురోజులు కులాసాగా గడిచాయి. ఆవేళ కనుంపండుగ. రాత్రిభోజనాలైయాక గదిలోకిపోయి మేమంతా పండుకున్నాము. నాకుమాత్రం నిద్దురరాలేదు. ఎంతప్రయత్నించినా కన్నేనాబరువెక్కలేదు. పదకొండుగంటలుకొట్టారు. అంతవరకు వీధిఅరుగుమీద పెనుప్రళయముగా జరిగిన పేకాటఆపివేసి ఎవ్వరిమానాన్నవారు వెళ్ళిపోయారు నిద్రపోయేందుకు. నాకు యింకా నిద్రరాలేదు. ఆ మర్నాడు మా బడికి దొరసానమ్మవచ్చి తణిఖీచేస్తుంది. అంచేత నేను పాఠాలన్నీ మనస్సులోనే, నెమరువేసుకుంటున్నా, నిద్రరాలేదు కాబట్టి. కొంతసేపటికి మా వీధిఅరుగుమీద మూలుగు వినబడ్డాది. క్రమేణా అది ఏడ్పుగామారింది. ఆ కంఠం చిరపరిచితమైనదే. భిక్షుకస్త్రీది. ఆమె కంఠమే అంత మధురముగాఉంటుంది. నేను పోల్చుకొని తగ్గిఉన్న దీపంహెచ్చుచేసి, వీధిలోనికి తలుపుతీసుకు వెళ్లడానికి భయపడి, గదిలోకిఉన్న కిటికీతలుపు రచి, 'ఏమమ్మో యిన్నాళ్ళు ఎక్కడ? ఎందు కల్లాఏడుస్తావని' ప్రశ్నించా. ఆ భిక్షుకస్త్రీ నిండావేసుకొన్న ముసుగు తొలగించి, వెక్కివెక్కి ఏడ్వటం ప్రారంభించింది. ఎంత చక్కని ముఖం! చక్కనివాళ్ళకుకూడా దరిద్ర ముం

టుందా అనుకున్నా నేను. ఏమిటికథ అన్నాను. తనకథ యీ విధంగా చెప్పింది.

'తల్లీ! నేను ఒక మహమ్మదీయస్త్రీని. చిన్నప్పుడే తల్లిదండ్రులు గతించారు. నాకు యుక్తవయస్సువచ్చేవరకు నా పినతండ్రి పెంచి, ఒక అభాజనునకే నన్ను యిచ్చి పెండ్లి చేశాడు. నా భర్త కుట్టుపని చేశేవాడు. వచ్చిన డబ్బంతా అతను త్రాగుడుక్రింద వినియోగమయిపోయేది. దరిద్రంలో మేము కుళ్లిపోయేవారము. ఇంతట నాకు యిద్దరు పిల్లలుకలిగారు. నన్నూ పిల్లన్నీ అతను పోషించలేక, మమ్ములను విసర్జించేసి, రంగం వెళ్లిపోయాడు. నాడుమొదలు నేను బిడ్డలు పగలల్లా ఉపవాసము చేస్తాము. రాత్రి నేను మాత్రము పైకివచ్చి సభూకరముచేసుకొని, ఏతల్లిహృదయమేనా కరిగితే నేను యింతతిని పిల్లలకు పెడతాను. లేకపోతే మేము తల్లి ముగ్గురము నిరాహారమే. కన్నతల్లీ! నీవు ఆమధ్య ప్రతిరోజూ పెట్టడముచేత, మేము సమృద్ధిగా తిని సంతోషింపగలిగాము. కాని ఒకరోజున చేతిపిల్లకిజబ్బుచేయబట్టి రాలేకపోయాను తల్లీ! ఇంతపండుగ వచ్చింది, యీమూడురోజులు అరుగుమీద మొగవారంతా పేకాటఆడుతున్నారు. నేను వేచివేచి వెళ్లిపోతున్నాను తల్లీ! తిండి లేక మలమలమాడి జీవాలేనా విసర్జిస్తాము గాని, మొగవారియెదుట పడమమ్మా! ఈ పండుగ మూడురోజులు మేము ఉపవాసాలే చేస్తున్నాము చల్లనితల్లీ! ఈరోజున నా కడుపులోబాధ చెప్పుకోనేందుకని వీధిలో చీకటిలో పేకాట అయిపోయేవరకు ఉండి, యిప్పుడు యీ అరుగుమీదికివచ్చి, నిశ్శబ్దంగా ఉండటంచేత, నీవు నిద్రించిఉంటావని తలచి, దుఃఖంపట్టలేక ఒకమారు యిక్కడ ఏడ్చి వెళ్లిపోదామని అనుకున్నాను. ఇంతట నీవు చల్లగా పిల్చావుతల్లీ!' అంది.

నాకు శరీరములో ఒకవిధమైనకంపం కలిగింది కథవిన్నాక. చిన్నపిల్లని, అస్వతంత్రురాలిని, అర్ధరాత్రివేళ ఇప్పుడు నే నీమెకు ఏమి సహాయముచేయగలనని అనుకున్నాను. నా హృదయంలో మెరుపులా ఒకటి మెరిసింది. మాఅమ్మ నాకు పండుగులో కొనుక్కొనితినమని యిచ్చిన రెండణాలు నా జేబులోనేఉన్నాయి. అవితీసి ఆ విడ చేతిలోపెట్టి 'అమ్మా! యిది పెట్టిపమేనా కొని నీవు నీపిల్లలు యీరాత్రితినండి. ప్రతిరోజూనా వస్తూఉండు, నేను నీకు తప్పక అన్నం పెడతాను. ఇకమీద యిక్కడ పేకాటకూడా ఎవ్వరూ ఆడరు' అని చెప్పాను. ఆ కిటికిలోంచి ఆమనిషి చేతులతో నాబుగ్గలు ముద్దుపెట్టుకొని, 'యింత చిన్నపిల్లవైనా, ఎంత ధర్మబుద్ధి, చల్లనితల్లీ! నీది' అంటూ ఆనందముగా వెళ్లిపోయింది.

దేశంపాడుగురా యిల్లాంటిభిక్షుకస్త్రీలు ఎంతమందిఉన్నారో! మూడురోజులపేకాట, ఒకమనిషి మూడుప్రాణాలుతీసింది. యిల్లాంటి ఎండకన్నెరుగనిఆడవాళ్ళని వీధిపడకుండా కాపాడుకోలేనిదేశం ఏందేశం ?